ప్రేమించినవారి సుఖశాంతులకోసం ఎంతటి త్యాగమైనా చేయడం సాధ్యం. ఆ మాటకు దానిని త్యాగమని కూడా పేర్కొనవలసిన పనిలేదు అంతా వ్యర్థమైనా, అపార్థానికి గురిఅయినా, నిందలకు దారితీసినా భరించవచ్చు కాని ఎవరికోసం ఇంతా జరిగిందో వారే దానిని అర్థం చేసుకోనప్పుడు నరకం తప్పదు.

---

**నిలువు టద్దంముందు** నిలబడి ఇన్ షర్టును సర్దుకుని, టై సరిగ్గా బిగించుకుని, నల్ల కళ్ళద్దాలను అందంగా చేతిలో ఊపుకుంటూ హుందాగా నడిచివస్తూన్న శ్రీనివాసును చూసి— షెడ్‌లోకి వెళ్ళి కారును వరండా ముందుకు తెద్దామనే ప్రయత్నంలో కదలబోయిన సుమిత్ర అట్టే నిలబడిపోయింది.

ఆలోచించుకుంటూ నడుస్తూన్న శ్రీనివాసును చూసి, అతనేం ఆలోచిస్తున్నాడో ఊహించుకుని, నిట్టూర్పు నణుచుకుని, తల నిరాశగా వాల్చుకుని సుమిత్ర కారు షెడ్డువైపు వెళ్ళిపోయింది.

అదే ఆలోచనల్లో ముందుకు వస్తూన్న శ్రీనివాసు కారు నడుపుతున్న సుమిత్రను చూసి నవ్వేడు బలవంతంగా. కారును ఆపుతూనే తలుపు తెరిచి ఓరగా కిటికీల్లోంచి చూసి నవ్వింది సుమిత్ర అందంగా.

వేయి గులాబులు గుబాళించేయి ఆ నవ్వులో. లక్షల మల్లెలు ఒళ్ళు విరుచుకున్నాయి మత్తుగా. కోట్ల నక్షత్రాలు తళుక్కుమన్నాయి.

ఇందులో అందం కనుపించనే లేదు అతనికి. అతనికి తన సుమిత్ర — గాలికి అల్లరి పిల్లల్లా ఎగిరే బాబ్డ్ హెయిర్ సర్దుకుంటూ, లిప్‌స్టిక్ పెదవులతో నవ్వు విరజిమ్ముతూ, స్లీవ్‌లెస్ జాకెట్టు బటన్సు లూజుగా పెట్టుకుని, చెవులకు చేతి గాజులంత రింగులు కదలాడిస్తూ, చేత్తో హేండ్‌బాగ్‌ను విలాసంగా ఊగిస్తూ కనులముందు కదలాడింది. ఆశ్చర్యపోయి రెప్పలు టప టప లాడించేడు.

సాధారణమైన జరీ చీర అంచుతో, బారెడు జడలోని మల్లియ దండలతో, నుదుట నయాపైస అంత కుంకంతో, అందమైన చిరునవ్వును పులుముకున్న పెదాలతో— నవ్వుతూ ఎదరే నించున్న సుమిత్ర భర్త కొంటెగా, కళ్ళు తమాషాగా చిట్లిస్తున్నాడని ఊహించి కిలకిలా నవ్వింది. కోయిలలు కువకువ లాడేయి. నెమళ్ళు నాట్యాలు చేసేయి.

ఈ సుమిత్రను చూసి లేని కోపాన్ని బలవంతంగా ఆహ్వానించి డ్రైవింగుసీటులో చదికిలబడ్డాడు శ్రీనివాసు.

అరక్షణంలో అతని ముఖంలో మారే రంగులను పరిశీలించినా, పరిశీలించనట్లే నటించి, టా టా చెప్పింది సుమిత్ర.

ఒకసారి సుమిత్రను గంభీరంగా చూసి, మళ్ళీ తలవంచుకుని అడిగేడు — "నువ్వా లేడీస్ క్లబ్‌లో ప్రారంభోపన్యాసం ఇవ్వదలుచుకున్నావా, లేదా?" అని.

"తప్పదా?" అంది జాలిగా చూస్తూ సుమిత్ర.

"నీ ఇష్టం. కానీ, ఈ పురాతన పద్ధతుల తోనే వెళ్ళే మాటయితే మానెయ్యి. ఇంతే నే చెప్పదలుచుకుంది" అంటూ విసురుగా కారు నడుపుకుని వెళ్ళిపోయేడు.

అట్టే నిలబడిపోయిన సుమిత్ర బాధగా నిట్టూర్చి, ప్రహరీ గేటు దాటి పోయేవరకూ కారును పరికించి లోపలకు వెళ్ళిపోయింది!

నవ్వేయి గాలికి రెపరెపలాడుతూన్న గోడమీది కాలెండర్‌లోని కాగితాలు. పెళ్ళయిన కొత్త రోజుల్లో స్వర్గ వీధులకు విహారాలు తీసుకెళ్ళి, కొన్ని రోజులు వరసగా అక్కడే నివసించే శ్రీనివాసు మొండి పట్టుదల ఈనాడు ఎన్ని రాత్రిళ్ళను శివరాత్రిళ్ళు చేసిందో తలుచుకుంటుంటే నీరు చిప్పిలిం దామెకు.

"నా నెల్తా, అమ్మగోరూ!" అంది పనిమనిషి రత్తమ్మ, బాధపడుతున్న సుమిత్రను ఆశ్చర్యంగా చూస్తూ. అన్నీ ఉన్న సుమిత్ర ఏడ్వడంలో అర్థం కనిపించడం లేదామెకు.

గబగబా సర్దుకుని, "ఏం, ఇంత త్వరగా పోతున్నా వీవేళ?" అంది, ఏదో అడగాలి కదా అని.

"ఆ డియ్యాల వత్తన్నా డమ్మగోరూ! మరి గంటే.....మీరు...సీరకట్టేయిదానం సెప్పండి నాకు. ఆడికి అట్లాగుంటేనే నచ్చుద్ది" అంది సిగ్గును దాచుకోవాలని యత్నిస్తూ.

సుమిత్ర కళ్ళల్లో ఆశ్చర్యం మెరిసింది.

"నీకు ఆ పద్ధతి ఇష్టంలేదు కదే మరి? అయినా మీ పద్ధతులు....."

"అవు, అమ్మగోరూ! కానీ, మా యమ్మ సెప్పిందీ—'తన అప్పుకోసం గావాల అరిచ్చం ద్రుడు బార్య నమ్మితే.....ఆమె తల ఒగ్గలేదా? గట్లనే—బర్త మాటలు యినాల' అని! అందుకని, ఆడికి నచ్చినట్లే....." ఆత్రుతగా మధ్యలో కలగజేసుకుని చివరకు నాన్చేసింది రత్తమ్మ.

ఈసారి సుమిత్ర కూడా నిశ్చయించుకుంది.

"మరి మీ కులంలో వెలివెయ్యరు టే?" అంది అక్కడికీ.

---

**కుమారి పి. లీల**

---

"పోనీ, ఏం సేత్తాం? రేపు ఈడి మనసు కాత్త యిరిగి, నన్నొదిలిపోతే ఎవురొత్తారు, అమ్మగోరూ?" ముందు చూపు చాలా ఉంది రత్తికి.

"సరేలే. వాడు రాగానే ఇక్కడకురా. నా చీర ఒకటి కట్టబెడతాను" అంది సుమిత్ర ఆప్యాయంగా రత్తిని చూస్తూ.

సిగ్గుపడిన రత్తి పారిపోయింది చిలకలా.

వెళ్ళిపోతూన్న రత్తిని చూస్తూనే ఒక నిర్ణయానికి వచ్చిన సుమిత్ర లేచి నిలబడింది. లేస్తూనే అదే పనిగా మోగుతూన్న ఫోను అందుకుంది.

లేడీస్ క్లబ్ సెక్రటరీ సుమిత్ర కంఠాన్ని పోల్చుకుంటూనే—"ఒప్పుకున్నారా?" అని అడిగింది ఆశగా.

"ఆఁ." నవ్వుతూనే అంది సుమిత్ర.

అవతలి కంఠం బోలెడు కృతజ్ఞతలు తెలుపుకుంది.

ఫోను పెట్టేసి, అరక్షణం నిలబడిం దామె.

దగ్గరలోనే ఉన్న హెయిర్‌కటింగ్ సెలూనుకు పోయింది తడబడుతూ. తప్పనిసరి అయినప్పుడు మాట శిరోధార్యం అని ఆమెకు తెలుసు. అయినా ఉగ్గుపాలతో నేర్పిన హైందవ నారీత్వం ప్రతి అడుగులోనూ కదలాడి ఆమె తనూ వల్లరిని నిలువెల్లా కదిలించేసింది.

నొక్కు నొక్కుల జుట్టు. బారెడు జడనూ ఒక్క కత్తెరతో తీసి బాధపడుతూన్న సుమిత్ర చేతికి అందించేడు కసాయిలా అతను. ఇంతమంది ఆడవాళ్ళు ఈ కాలంలో జుట్టు బాబ్ చేయించుకుంటున్నా, హైందవత్వం ఉట్టిపడే ఈమె కన్నుల్లోని బెరుకుతనానికి ప్రప్రథమంగా జాలిపడ్డాడు ఆ సెలూనతను.


కన్నుల్లో బెరుకు తగ్గినా నీరు ఆగలేదు. నిర్లిప్తంగా కూర్చుండిపోయింది పది నిముషాలు. ఆ ఖంగారులో కుడికన్ను లదిరిందని ఆమె గుర్తించనేలేదు.

'మాంగల్యానికి చిహ్నాలైన ఇవన్నీ వదిలి....' మనస్సు గిజగిజ లాడింది.

చిన్నప్పటి సంఘటన అంతర్వీథిలో అడుగులు వేసింది.

ఒకసారి చెల్లాయి వెంకటేశ్వరస్వామికి మొక్కుకున్నానంటూ జడను సగంపైగా కత్తిరించుకుంది. అది చూసిన ఆనాటి సుమిత్ర, ఆడపిల్ల తలమీద కత్తెర పడడం గూర్చి గంటల కొలదీ ఉపన్యాసం ఇచ్చింది. ఈ విధి ఇలా జరగాలనుందని ఆమెకు మాట మాత్రంగా తెలిసినా, ఆనాడు ఆమె హెచ్చరించేదే కాదేమో!

తన పని పూర్తి చేసుకుని చెయ్యి చాచేడు సెలూనతను. డబ్బు లతని చేతిలో పడేసి ఇంటికి పోయింది. నిర్లిప్తత వదిలి భర్తకు ఇష్టమైన పనులే చేస్తున్నా ననుకుంటూ మనస్సుకు నచ్చచెప్పి అంతరాత్మను జోకొట్టేసింది.




# వెన్నెలలో వేడి

త్వరత్వరగా స్నానం ముగించి, ఎప్పటినుండో దాచిన పెట్టె తెరిచింది. రవ్వల దుద్దుల స్థానే చేతి గాజులంత పెద్ద రింగులు తగిలించుకుంది చెవులకు. స్లీవ్‌లెస్ జాకెట్టు వేసుకుని, క్షణం సిగ్గుపడినా తల ఒగ్గింది. పెదాలకు రంగు పూసుకుంది. అతను ఎన్నికచేసిన దేవతా వస్త్రాలనే ధరించింది. చేతులకు ఉన్న రాళ్ళ గాజులు తొలగించుకుని, మరీ మానెయ్యలేక, చీర రంగులోనే సాదా రంగు గాజులు వేసుకుంది.

డ్రెస్సింగ్ టేబిల్‌లోని అద్దం, అబద్ధాన్ని చూపిస్తున్నట్లు అనుకుంది—ఆమె నీడను చూపిస్తూ.

హైహీల్డు చెప్పులు ధరించి మరొకసారి

## ఎక్కువ పొడుగవండి



క్రొత్త శాస్త్ర పద్ధతుల తోను, వ్యాయామముల తోను ఎక్కువ పొడుగవండి. స్త్రీ పురుషుల కెల్ల రకు తగినవి.
వివరములు ఉచితం.

**Total Health, Azad Market, (A PV) Delhi-6.**



## నవభారతి గురుకులం

( ఉన్నత వసతి విద్యాలయం )

**రా జ మ ం డ్రి**

ఆదర్శ ప్రశాంత వాతావరణములో విలసిల్లు చక్కని పాఠశాల. బాలురకు మాత్రమే వసతి సౌకర్యములు గలవు. 16—6—1965 వ తేదీన తెరువబడును. 6 వ తరగతినుండి 11 వ తరగతి వరకు (Ist Form to VI Form) ప్రవేశము కలదు. 6 వ తరగతిలోనికి ప్రవేశ పరీక్షలు జూన్ నెలలో జరుగును. 6, 7, 8 తరగతులలో ఇంగ్లీషు మీడియం సెక్షనులు గలవు. కోరినచో ప్రాస్పెక్టసు ఉచితముగా పంపబడును.

రాజమండ్రి.
26—4—65. కరస్పాండెంట్







# వెన్నెలలో వేడి

అద్దంలో చూసుకుని తనను తాను అసహ్యించుకుంది. అయినా తమాయించుకుని వెళ్ళబోతూ దేవతా వస్త్రాలలోనుంచి తొంగిచూస్తున్న మంగళసూత్రాలను జాకెట్టు లోపలగా వేసుకుంది. 'చంద్రమతి దళసరి బట్టలు కట్టుకున్నా, ఆమె పతివ్రతా తిలకం కాబట్టి ఆమె మంగళసూత్రాలు భర్తకు కనిపించేయిట! ఈనాడైతే అందరికీనూ!' అనుకుంది లోలోనే.

అనుకోకుండా కనిపించి తన వేష భాషలతో భర్తను ఆశ్చర్యంలో ముంచెయ్యాలని ఊహించి ఆ సంతోషంలో హోటలుకు పోయి భోజనం చెయ్యవచ్చునని అనుకుని, భర్త సంతోషంలో మునిగి తేలిపోవడం ఊహించుకుంటూ తలుపులన్నీ వేసి బయలుదేరబోతూంటే రత్తి వచ్చింది ఆశగా.

గుమ్మం దిగుతున్న సుమిత్రను చూసి సుమిత్రగా గుర్తించలేక, "మా అమ్మగారు లోపల లేరా?" అంది చేతులు నులుముకుంటూ.

నల్ల కళ్ళద్దాలు తీసి చేత్తో పట్టుకుని పక పకా నవ్వేసింది సుమిత్ర.

ఆశ్చర్యంలో ఉక్కిరిబిక్కిరయింది రత్తి. ఏవగింపు ఆమె కను కొనలలో మెదిలింది.

ఆ మెరుపును గుర్తించిన సుమిత్ర మధ్యలోనే నవ్వు ఆపేసి బాధగా తల వంచుకుంది.

"ఏవే టమ్మగోరూ?" అంతకుమించి మాట్లాడలేదు రత్తి.

"మీ బాబుగారు నేను ఇలా ఉండాలని రెండు నెలలనుండి చెప్పి చెప్పి మాటలు మానేసేరు నాతో. ఇవాళ ఓ లేడీస్ క్లబ్‌లో నేను మాట్లాడాలని ఆయన చెప్పేరు. ఏం చెయ్యాలో తోచక నేను తికమక లాడుతుంటే—నీ నిర్ణయం నాకు కూడా సరిపోయింది, రత్తి. అందుకని....." అంది ఇక పూర్తి చెయ్యలేక.

"అందుకనే గావాల—తమరితో బాబుగోరు మాట్లాడడంలేదు. పోనీండి, అమ్మగోరూ! ఏం చేత్తాం? మన ఇట్టాలన్నీ ఆనాడే పోయాయి. ఇయ్యాల వాళ్ళ కిట్టమైందే మనకూ ఇట్టం కావాల" అంది ఓదారుస్తూ.

బాధగా నిట్టూర్చి, రత్తిని లోపలకు తీసుకెళ్ళి ఒక మంచి చీరతీసి, తన పరికిణీ ఇచ్చి మరీ కట్టబెట్టి రత్తిని సాగనంపుతూనే తన కారులో సాగిపోయింది శ్రీనివాసు ఆఫీసుకు మొట్టమొదటిసారిగా సుమిత్ర.

త్రోవలో, భర్త ఏ విధంగా ఆశ్చర్యపోతాడో ఊహించుకుని 'దాని కనుగుణంగా ఈ విధంగా ఉండాలి' అనుకుంటూ అతని ఆఫీసు చేరుకుంది మైమరుపులో సుమిత్ర.

పిల్లిలా అడుగులో అడుగు వేసుకుంటూ అతని ఆఫీసు గదిలోకి ప్రవేశించిన సుమిత్ర—స్పృహతప్పి కుర్చీలో ఒరిగి ఉన్న భర్తను చూసి కెవ్వుమని అరిచి కుప్ప కూలిపోయింది.

కొత్తగా కత్తిరించిన బాబ్‌డ్ హెయిర్ అల్లరి పిల్లల్లా కదిలిపోయింది.

ఆమె అరుపులు వింటూనే ఆఫీసరు గదిలోకి వచ్చిన ఆ ఆఫీసు పరివారం అందరూ నిశ్చేష్టులైపోయారు. త్వరత్వరగా సుమిత్ర ముఖాన నీళ్ళు చిలకరించి, తేరుకోగానే—అప్పటికే ఎన్ని నీళ్ళు చల్లినా తెలివిరాని శ్రీనివాసును పంపిన కారు వెనకనే ఆమెనూ తీసుకు వెళ్ళిపోయేరు.

మనస్సు మొద్దుబారిపోగా, మెదడు తిమ్మిరెక్కిపోగా, హృదయం కఠిన శిలయ్యిపోగా—నిశ్చలం నిరీహ నీరస నిర్నిమేష దృక్కులతో పరికించే ఆమెను చూసి జాలిపడ్డారు కొందరు.

ఆమెను ఇంతక్రితం చూసినవాళ్ళు ఆమె వేషంలోని ఈ మార్పుకి ఆశ్చర్యపోయి, 'బాగా జరిగిందిలే' అనుకున్నారు.

ఇంజక్షన్లూ, మందులూ కలిసి అతని శరీరంలో దూరి గొడవపడి శ్రీనివాసు నిద్రను భంగపరిచేయి. మేల్కొన్న శ్రీనివాసు, ఎదురుగా శిలలా నిలబడ్డ సుమిత్రను చూసి—"అహహ!" అని బిగ్గరగా, నవ్వుతూ ఆమె జుట్టు పట్టుకుని "ప్చ్! కోతి!" అన్నాడు అప్సరతి అదిరిపడేట్లు.

ఉలిక్కి పడింది అచటి పరివారమంతా.

నమ్మలేక్కు సుమిత్ర అతన్ని మంచంమీద కూర్చోబెట్టి అతని పక్కనే చోటు చేసుకుని కూర్చో యత్నిస్తూ, "ఎలా ఉంది?" అంది బాధగా, ఆప్యాయంగా అతన్ని చూస్తూ.

దగ్గరకు రాబోయిన ఆమెను వారించి, "అరరే! నా దగ్గరకు రాకు" అంటూ భయపడిన వానిలా మంచంమీదనుండి ఒక్క దుముకు దుమికి, పరుగెట్టి పారిపో యత్నించి—పట్టుకుని ఆపిన డాక్టరు వెనకాల నక్కి, "డాక్టర్! రక్షించు, రక్షించు!" అన్నాడు జాలిగా, బాధగా, భయంగా ముఖం పెట్టి.

నిరుత్తరురాలయింది సుమిత్ర. కళ్ళు వాల్చేసింది. గుండెలో గుబులుగా, దాగని బాధ అణిగిపోతూంటే ఆపుకుంటున్నది అతి ప్రయత్నంమీద. పరిస్థితి గ్రహించిన డాక్టర్ ఆమెను బయటకు తీసుకుని వెళ్ళమని నర్సుకు సైగచేసి, అతన్ని జాగ్రత్తగా నడిపించుకుని వెళ్ళి మళ్ళీ అదే మంచంమీద కూర్చోబెట్టి, "ఆమె ఎవరో నీ కసలు తెలియదా?" అని అడిగేడు అనునయిస్తూ.

"ఆమె తెలియదు. నువ్వెవరో కూడా తెలియదు. కానీ, నీ మెడలో పామును చూసి డాక్టరనుకున్నా" అన్నాడు బుంగమూతిపెట్టి, స్టెతస్కోపునుండి దూరంగా జరగడానికి యత్నిస్తూ.

శ్రీనివాసు ఆఫీసులో పనిచేసే ఒకతన్ని చూపించి, "ఇతనెవరో నాకు తెలియదు. నీకు తెలుసునా?" అని అతన్ని పరిశీలిస్తూ అడిగేడు డాక్టరు మళ్ళీ.

"ప్చ్! మీరంతా ఎవరో నాకు తెలియదు. నే నిక్కడకు ఎందుకు వచ్చానో అసలు తెలి

యుడు.'' పెదవి విరుస్తూ, మారాంచేస్తూ జవాబిచ్చేడు శ్రీనివాసు.

మరోసారి అతన్ని పరీకించి, అతనికి మార్ఫియా ఇంజక్షన్ ఇచ్చి "అబ్బే—ఏదో షాక్ తగిలింది కాబోలు. ఈసారి తెలివి రాగానే తెలుస్తుంది'' అన్నాడు అచటి పరిజనాన్నుద్దేశించి.

"అసలేం జరిగిందో....'' అడిగేడు మళ్ళీ.

ఏమీ జరగలేదని సూచిస్తూ తలలు ఊపేరందరూ. కానీ అందులో ఒకతను ముందుకు వచ్చి, "నాకు తెలుసునండీ. ఈయన భార్య ఇంతక్రితంవరకూ ప్రాచీన పద్ధతులలోనే ఉండేది. ఈవేళ ఈ విధంగా అలంకరించుకుని వచ్చేసరికి ఈయనకి ఒక్కసారి షాక్ తగిలి మతి పోయినట్లుంది'' అన్నాడు అభినయిస్తూ.

నర్సును బలవంతంగా వదిలించుకో యత్నించి, లాభంలేక మంచి నీళ్ళు కావాలని అడిగి, ఆమె అటు తిరగగానే ఇటు పరుగెత్తుకుని వస్తూన్న సుమిత్ర ఈ మాటలు విని అక్కడే ఆగిపోయింది. దోసిట్లో ముఖం దాచుకుంటూ, వెక్కి వెక్కి ఏడుస్తూ పారిపోయింది లిప్పుమని.

పరుగులో బజారుకుపోయి నవరం కొనుక్కుని ఇంటికి పోయి అవస్థమీద జడ అల్లుకుని, చెవులకు దుద్దులు తగిలించుకుని, చేతులకు నిండుగా గాజులు వేసుకుని సాధారణమైన చీర ధరించి అదే వేగంలో వచ్చింది ఆస్పత్రికి సుమిత్ర.

విర్జీవిలా ఆస్పత్రిలో స్పెషల్ రూములో పడుకొన్న శ్రీనివాసును సమీపించి, తలను మంచం పట్టెమీద వాల్చి ఏడుపును ఆపుకుంటున్నది సుమిత్ర బలవంతంగా.

మరో ఆరు గంటల తర్వాత కనులు నులుముకుంటూ లేచిన శ్రీనివాసు—శోష వచ్చి మంచం పట్టెమీద వాలిపోయిన సుమిత్రను చూస్తూనే —మంచం మీదనుంచి ఒక్క దుముకులో ఉరికి పరుగెత్తి పారిపోతూ, ఈ హడావుడిలో లేచి అతని వెనకనే పరుగులో వస్తున్న సుమిత్రను చూసి తనను తాను రక్షించుకోవడానికి చేతి కందిన వరుకులను ఆమెమీద విసిరేయ నారంభించేడు.

ఈ గడబిడలో అటు వచ్చిన డాక్టరు అతన్ని ఆపి, అతను విసిరిన గాజుగ్లాసు తగిలి ముఖం రక్తసిక్తమైపోయి కుప్పలా కూలిపోయిన సుమిత్రను చూసి అట్టే ఆగిపోయేడు.

తల తిరిగిపోగా, బలవంతంగా అతన్ని లాక్కెళ్ళి మరో గదిలో పరుండబెట్టి తలుపులు బిగించి సుమిత్రను సమీపించేడు డాక్టరు.

కోలుకున్న సుమిత్ర, బాధ ఉప్పెనలా పొంగగా, "డాక్టర్! ఆయ నింక.....'' అంటూ ఏడ్చేసింది వెక్కి వెక్కి.

ఎంత జాలి కలిగించే దృశ్యాలను రోజూ చూస్తున్నా, ఈమెను చూసి మరింత జాలిపడి, "అబ్బే—అసలు దేన్నో చూసి షాక్ ఫీలయ్యారు. ఎందుచేతనో.....'' అంటూ నసిగేడు.


నవ్వింది సుమిత్ర. అందులో జీవంలేదు. "నాకు తెలుసు, డాక్టర్! ఇందాక ఆయన ఎవరో మీతో అంటుంటే విన్నాను. కానీ అది తప్పు. అందులో నిజంలేదు, డాక్టర్! నన్నీ విధంగా అలంకరించుకోమని రెండు నెలలనుంచీ బలవంత పెట్టి నేను ఒప్పుకోలేదని నాతో మాటలే మానేసేరు. ఇవాళ ఇక లాభంలేదని, ఆయన ఆజ్ఞాపించిన తరువాతనే, లేడీస్ క్లబ్‌లో ప్రారంభోపన్యాసం కోసం ఇలా తయారయి ఆయనకు సంతోషంలో పిచ్చి ఎక్కించాలని ఆదుర్దాగా నే వెళ్ళేసరికి....నేవెళ్ళేసరికే ఆయన సీటులో స్పృహ కోల్పోయి ఉన్నారు.'' ముగిస్తూనే తిరిగి రోదించ సాగింది. వెక్కిళ్ళు ఆగక ఒకదాని వెంబడే ఒకటి చీమల బారుల్లా వస్తున్నాయి.

సేడు.

నర్సు తెచ్చిఇచ్చిన స్లీపింగ్ డోసు తీసుకుని మగతగా పడుకున్న సుమిత్రను చూపిస్తూ, తిరిగి వచ్చిన డాక్టర్‌తో చెప్పింది నర్సు—'' ఆమె బాధని నేను చూడలేక నిద్రమందు ఆమెకు తెలియకుండా ఇచ్చేను, డాక్టర్'' అని.

నవ్వి నర్సుతో చెప్పేడు. "పాపం! ఈమె భర్త ఆఫీసు గదిలో కొత్తగా ఒక 'ఎయిర్ కూలర్' పెట్టేరుట. మంచి గాలికి బదులుగా దానిలోనుంచి, ఏదో విషవాయువు రావటం మొదలుపెట్టింది. ఈ విషయం తెలియక అతను అందులోనే ఉండేసరికి మతిపోయినట్లుంది.'' సుమిత్రనుజాలిగాచూస్తూ అన్నాడు.

మత్తుమందు నిద్రలో కూడా ఆమె బాధ



ఒంటరిపక్షి

చిత్రం—గోలి నాగేశ్వరరావు (హైదరాబాదు)

హృదయవిదారకంగా ఉన్న ఆమె రోదనలో ఆఖరి విషయాన్ని పునరుచ్చరించుకుంటూ ఉలిక్కిపడి, ఉరుకులో శ్రీనివాసు ఆఫీసు అడ్రసుకు ఫోనుచేసేడు డాక్టరు.

నైట్ వాచ్‌మన్ స్వరం వెక్కిరించిందతన్ని.

"మీరు రెస్టు తీసుకుంటూండండి. ఇప్పుడే వస్తాను'' అంటూ హడావుడిగా బయటకు పోయి, నర్సుకు పనులు పురమాయించి ఆ ఆఫీసులోని కొంతమందిని ఇళ్ళదగ్గర కలుసుకుని అసలు విషయం తెలుసుకుని నిరాశగా కాళ్ళూ చేతులూ వేలాడేసుకుని తిరిగి వచ్చే

ఆగక ఏడుస్తూ పీడకలనుండి లేచిపోయింది' లేస్తూనే డాక్టర్‌ను చూసి, విషయమంతా విని' "నాకు కూడా మతి పోగొట్టండి, డాక్టర్! ప్లీజ్, డాక్టర్! నా మతి కూడా పోగొట్టే....'' ఏడ్చింది సుమిత్ర.

"బాధ పడకండి. అతనికి నయం కావచ్చు'' అన్నాడు డాక్టర్ లాంఛనప్రాయంగా. అందులో రవ్వంత కూడా ఆశలేదు అతనికి. ఈమాత్రం వింటూనే సుమిత్ర సంతోషంలో తల మునకలు వేసింది.

* * * *

ఆ విధంగా అతని కోసమని అతి నవీనంగా

అనన్య సామాన్య ప్రచారం గల తెలుగు వార పత్రిక ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక

తెల్ల వెంట్రుకలుండవు

హెయిర్‌డైతోకాదు. సెంటు చేర్చబడిన మా ఆయుర్వేద తలనూనె తెల్లజుట్టును నిగనిగలాడే నల్లజుట్టు చేస్తుంది. ఇది మెదడుకు, కళ్ళకు టానిక్కు. ఒకసారి వాడి చూడండి. మీరు పూర్తిగ సంతృప్తి పొందు: రు. వెల రు. 10/— పూర్తి కోర్సు రు. 25/—

SHYAM AYURVED BHAVAN,
No. 52, P.O. Katri Sarai (Gaya).

డాక్టర్ వృత్తి చేయండి!



ఇంటో కూర్చొని పోస్టల్ ట్యూషనుద్వారా ప్రభుత్వంచే పరిగణింపబడిన సంస్థనుంచి హోమియోపతిలో మూడు అత్యున్నతమైన డిగ్రీలు, ఎం.డి.హెచ్., ఎం.ఎస్‌సి. హోమియో గోల్డు మెడలిస్ట్ పొందండి. పేర, డబ్బు గడించండి. ఉచితపాస్పెక్టసుకొరకు వ్రాయండి.

IMPERIAL HOMEOPATHIC COLLEGE
(APW), Jammu Tawi-12.

# వెన్నెలలో వేడి

అలంకరించుకున్న సుమిత్రను అతను చూడలేదు సరికదా—అదో పెద్ద బెడదై కూర్చుంది ఆమెకు.

శ్రీనివాసు మతి చలించిన విషయం తెలుస్తూనే వేంచేసిన అతని తల్లీ, చెల్లెలూ గుమ్మంలో కోతుల్లా గెంతేరు.

"నే నానాడే చెప్పేను—'చదువుకున్నది రా, బాబూ! అసలు నీతో సంసారం చేస్తుందా?' అని! నా మాట వింటేనా?" నెత్తీనోరూ మొత్తుకుంది తల్లి.

"అవునే. చదువుకున్న వాళ్ళు సంసారా లెక్కడ చూసుకుంటారు? వాళ్ళకి షోకులకే ఎంతటైమూ చాలదు." వదినగారిని పరిశీలనగా చూస్తూ అంది అతని చెల్లెలు.

నిర్దోషియై కూడా దోషిలా నిలబడింది సుమిత్ర.

అది మొదలు, ప్రతి రోజూ పొద్దున్నే ఒక గంట ఈ విధంగా గజ్జెకట్టి— ఇక అప్పైన ఇది అందించమనీ, అది అందించమనీ అంటూ విలయతాండవం మొదలుపెట్టేవారు.

ఎల్లాగో అన్నీ అందించి, తెమిలి, భర్త దగ్గరకు పోవాలనే ఆమె ప్రయత్నాలన్నిటినీ అన్ని విధాలుగా అణగార్చి మహాప్రేమ ఉన్న వాళ్ళలా కడుపునిండా అన్నీ తిని ఆ విధంగా వదిలేసి ఆస్పత్రికి పోయేవాళ్ళు.

కష్టపడి పనులన్నీ త్వరగా ముగించుకుని—అతనికి బాబ్డ్ హెయిర్ నచ్చటంలేదని మహా అవస్థపడి సవరం జడ అల్లుకుని సుమిత్ర చేరుకునేవేళకు వెళ్ళిపో నుద్యుక్తులైన ఆ ఇద్దరూ ఆగిపోయి ఈమెను హింసించమొదలుపెట్టేవారు.

కటకటాల గదిలో కూర్చుని బయటి తతంగం పరిశీలించే శ్రీనివాసుకు అర్థం చేసుకునే శక్తి నశించినా, ఒక్కొసారి విరగబడి నవ్వేవాడు, వెన్వెంటనే ఏడుపు ప్రారంభిస్తూ.

వస్తూన్న సుమిత్ర జడను గుంజి సవరం ఊడిపోగానే దానితో ఆమెను కమ్చీ కర్రతో కొట్టినట్లు కొట్టేది అతని చెల్లెలు.

ఏడ్చే సుమిత్రను చూసి సమీరునికి కూడా ఏడిపించ బుద్ధిపుట్టి ఆమె జుట్టును కాస్త లేపేసేవాడు. కటకటాలమధ్య తల దూర్చి తనను జాలిగా పరికించే సుమిత్రను చూసి శ్రీనివాసుకు కూడా పిచ్చి ఎక్కువై, రెండు చేతులతోటీ గుప్పెళ్ళకొద్దీ జుట్టు పీకేసేవాడు కహ కహ నవ్వుతూ.

దుఃఖం వచ్చేది సుమిత్రకు, భర్త స్పర్శవల్ల కలిగిన సంతోషంతోపాటు. చప్పట్లు కొడుతూ గెంతేది అతని చెల్లి. తల్లి విరగబడి నవ్వేది. డాక్టరు మాత్రం ఇది చూసి సహించలేక శ్రీనివాసును బెదిరించి వీళ్ళను అదిలించేవాడు. అందుకని సుమిత్రకూ, డాక్టరుకూ ముడివేసి తృప్తిపడేవాళ్ళు తల్లీ కూతుళ్ళు.

మరొక్కసారి "ఇహిహీ" అని చెల్లెల్ని పిలిచి ఆమెను కటకటాల మధ్యనుంచి కొట్టబోయే వాడు. ఆ సమయంలో అతన్ని అతని తల్లి తిట్టే తిట్లనూ, పెట్టే శాపనార్థాలనూ వినలేక సుమిత్రే అడ్డుపడి తనను తాను అతనికి అందించుకుని అతను కొడుతూంటే నిశ్శబ్దంగా సహించేది.

పిచ్చివాళ్ళముందు వాళ్ళను పిచ్చివాళ్ళంటే పిచ్చి మరింత ఎక్కువైనట్లు, శ్రీనివాసు స్వ

ది సద్వైద్యశాల (ప్రైవేట్) లిమిటెడ్, నంజన్‌గూడు
ఆయుర్వేద విద్వాన్ బి. వి. పండిట్ గారి

నమ్మకమైన నంజనగూడు కుటుంబ ఔషధములను వాడుడు.

నంజనగూడు పండ్లపొడి

తీపి, ఉప్పు ప్యాకెట్లు.

సకల పండ్లవ్యాధులను ఆపి, మాన్పు
ఐ.డి.యల్. 61. నంజనగూడు పండ్లపొడి (డబ్బా)

దేహారోగ్యమునకు టానిక్కులు: అల్మంపైన్: ఓజోలా; ప్రీలకు. జీవని.
ప్రతి టౌనుకూ మా ఔషధములకు 'మా సాకిస్టుగా' ఒకరిని తీసికొనగలము
సోల్‌ఏజంట్లు: యునైటెడ్ కన్సరన్ 54. బందరువీధి. మదరాసు. బ్రాంచి హైదరాబాద్. విజయవాడ.

No. 2.

క్షణంలో ఒకటికి పదిసార్లు "పిచ్చి....పిచ్చి" అంటూ అతన్ని రెచ్చగొట్టి, అతనికి మరింత పిచ్చి ఎక్కించి నవ్వుకుంటూ వెళ్ళిపోయేవాళ్ళు.

ఇది సహించలేని సుమిత్ర డాక్టరు కాళ్ళమీద పడి ప్రాధేయపడి బతిమిలాడుకునేది.

"ఈ ఆస్పత్రి వాతావరణంలో, ఈ పిచ్చి వాళ్ళమధ్య, ఇక్కడకు వచ్చే ప్రతివాళ్ళూ 'పిచ్చి' అంటూ తద్వారా రెచ్చకొట్టే పరిస్థితులలో ఆయన పిచ్చి తగ్గదు, డాక్టరుగారూ! ఆయనను డిస్ఛార్జిచేసి నాకు అప్పగించేయండి. లేకపోతే నాకూ మతి పోగొట్టి అదే కటకటాలలో బంధించండి" అంటూ ఏడ్చేది వెక్కి వెక్కి.

ఎంతమంది రోగులనో చూసిన డాక్టరు—జాలిపడడాన్ని తగ్గించుకుని హృదయపూర్వకంగా విధులను నిర్వర్తించుకునే డాక్టరు—ఈ పరిస్థితిలో తన కళ్ళనుండి తనకే తెలియకుండా అశ్రువులు రాలుతూంటే ఆశ్చర్యపోయేడు.

జాలిచేత మనుష్యులవల్ల ఎన్ని పనులైనా చేయించుకోవచ్చుననే మార్గం తెలిసి ఉన్న సుమిత్ర—మరింతగా బతిమిలాడేది.

వెలితి నవ్వు నవ్వి, "ఒకవేళ పిచ్చిలో అతను నీ పీక పిసికేసినా, తనని తను చంపుకున్నా ఆ మహాపాపం నాకే తగులుతుంది! అదీగాక పిచ్చి వాళ్ళకి పౌర్ణమి, అమావాస్య రోజుల్లో పిచ్చి మరింత ఎక్కువయ్యే ప్రమాదాలున్నాయి. ఏయే సమయాల్లో వాళ్ళెల్లా ప్రవర్తిస్తారో మాకు తెలిసినట్లు నీ కెలా తెలుస్తుందమ్మా? వద్దు" అనేవాడు డాక్టరు, చిన్న పిల్లను బుజ్జగించినట్లు బుజ్జగించి.

"ఒక పరిస్థితిలో పోయిన మతి మళ్ళీ అదే పరిస్థితిలో రావడానికి అవకాశాలు ఉన్నాయి, డాక్టర్. ఈ ఆస్పత్రి వాతావరణం ప్రతి మనిషిలోని పిచ్చినీ మరింత ఎక్కువ చేసేలా ఉంది. వారి తల్లీ చెల్లెళ్ళ సమక్షంలో వారికి మరింతగా....." రోదించేది మరి పూర్తి చెయ్యలేక.

"డాక్టర్! ఇదే పరిస్థితులలో మీకు అతి సన్నిహితులు ఉంటే ఏం చేసేవారు, డాక్టర్?" ఆశగా అడిగేది.

"నా జీవితం మీ చేతుల్లో ఉంది, డాక్టర్! ఒకే ఒక్క ఆశాకిరణం ఉంది. దాని వెలుగులో ఒక్కసారి నా అదృష్టాన్ని పరికించుకుంటాను, డాక్టర్! అవకాశం కల్పించు, డాక్టర్!" చిన్న పిల్లలా అడిగేది.

"నా జీవితానికి ఆయన వెలుగు. ఆయనే ఇలా చీకటిలో తచ్చాడుతూంటే నా జీవితం గడ్డ అమావాస్య, డాక్టర్! ఒక్కసారి నా సౌభాగ్యాన్ని పరీక్షించుకోనీ, డాక్టర్!" ప్రార్థించేది.

"నేను చాలా అదృష్టవంతురాలినని అందరూ అనేవారు, డాక్టర్! నా భర్త అనారోగ్యాన్ని నా చేత్తో మాయించేసే అదృష్టం నాకు కలిగించు, డాక్టర్! చిన్న పిల్లవాడిలా ఆయన మారాం చేస్తూంటే ఆయనని సవరించుకోగలిగే తెలివితేటలు—నాకే కాదు—ప్రతి స్త్రీకీ ప్రసాదిస్తాడు భగవంతుడు. నా అదృష్టానికి గీటు గీసి పరికించుకునే అవకాశాలు కలిగించు, డాక్టర్!"

ఇవన్నీ విని విని ఒక నిర్ణయానికి వచ్చిన డాక్టర్—సుమిత్రచేత ప్రమాణాలుచేయించుకుని, ఆరు నెలలు గడువిచ్చి, జరిగే ప్రతి విషయం తనకు తెలియబరిచేలా మాట తీసుకుని—ఆమెకు ఆమె భర్తను అప్పగించేందుకు ఒప్పుకున్నాడు.



వజ్రసత్వ (నలందా శిల్పానికి అనుకృతి)

చిత్రం—ఒ. వి. నరసింహులుగుప్త (మదనపల్లి

చాకచక్యంగా, శ్రీనివాసు తల్లికీ, చెల్లెలికీ తెలియకుండా డాక్టరు సహాయంతో ఒక కారు అమ్మించేసింది సుమిత్ర.

బాంకునుంచి డబ్బంతా తీసేసుకుంది.

కొన్ని బట్టలు ముందస్తుగానే బయటకు చేరవేసుకుంది. తన నగలన్నిటినీ అమ్మేసి మొత్తం డబ్బును పోగు చేసుకుంది.

ఒకానొక రోజు డాక్టరు సహాయంతో నిద్ర మందు మత్తులోని భర్తను తమ రెండవ కారులో వేసుకుని, ఉత్తరాలు వ్రాస్తానని డాక్టరుకు మళ్ళీ మళ్ళీ మాట ఇచ్చి, తన అదృష్టాన్ని వెతుక్కుంటూ వెళ్ళిపోయింది సుమిత్ర.

(సశేషం)

# వెన్నెలలో వేడి

**కుమారి పి. లీల**

### జరిగిన కథ

**సుమిత్ర భర్త శ్రీనివాసుకు మతి చలించింది. శ్రీనివాసు తల్లి, చెల్లెలు అతన్ని రెచ్చగొడుతున్నారు; సుమిత్రను అనేక విధాల హింసిస్తున్నారు. ఎలాగైనా భర్తను తిరిగి మామూలు మనిషి చేయాలని సంకల్పించి, డాక్టర్ అనుమతి పొంది, మరెవరికీ తెలియకుండా తనతో తీసుకొని పోయింది సుమిత్ర.**

---

## (క్రిందటి సంచిక తరువాయి)

"డాక్టర్,

మిమ్మల్ని అభినందించాలో, అభినందించాలో కూడా నిర్ణయించుకోలేనంత మూర్ఖురాలిని నేను.

నా జీవిత భాగస్వామిని నాకు అప్పగించి, నాకు నేను నిర్వహించుకునే పరిస్థితి కలిగించినందుకు మిమ్మల్ని తప్పక అభినందించాలి. నాకు తెలుసు.

నా జీవితచక్రం బురదలో ఇరుక్కుని పోకుండా కాపాడిన మీరు నాకు స్నేహపాత్రులు.

ఏయే పరిస్థితులలో ఏయే విధంగా నేను సంచరించాలో తెలియబరిచి నాకు అడుగడుగునా మార్గదర్శకులైన మీరు నాకు గురుతుల్యులు.

నా భర్తను నా చేతులకు అందించి, నన్ను నేను పరీక్షించుకునే అవకాశం ఇచ్చిన తల్లితండ్రులు మీరు.

ఎంతో అదృష్టవంతురాలినైన నన్ను—కుసంగీటులలో భర్తను నిలబెట్టగలిగిన నన్ను—భర్త సాన్నిధ్యంనుండి వంచించడానికి ప్రయత్నించిన విధిని వెక్కిరించిన దైవస్వరూపులు మీరు.

అందుకనే మిమ్మల్ని ఎటూ సంబోధించలేక, చిన్న మాటలతో నాలోని ధృతమైన అభిప్రాయాలను తెలికపరుచుకోలేక ఎంతమంది ప్రాణులనో రక్షించే మిమ్మల్ని డాక్టరుగానే సంబోధించేను. క్షమిస్తారు కదూ?

మీ ఉద్దేశ్యానికి వ్యతిరేకంగా, మిమ్మల్ని బలవంతంగా ఒప్పించి నేను బయలుదేరుతుంటే నిన్న రాత్రి, ఆఖరి క్షణంలో శుక్లపక్షపు దశమి చంద్రుడి వెన్నెల కాంతిలో మీ కళ్ళలోని తడిని నేను అర్థం చేసుకోగలిగినా, ఆశతో ముందుకు సాగిపోయేను.

మీరు చెప్పినట్లుగానే మా పనివానిని రత్తి మొగుడు ఇక్కడ నన్ను చేర్చి ఇవేళ వెనక్కి వెళ్ళిపొయ్యేడు. అతని చేతికే ఉత్తరం ఇద్దామనుకున్నాను. కానీ, ఒకవేళ ఎవరైనా ఇది దొంగిలిస్తే? ఏమిటో పిచ్చి భయం!

నిన్నరాత్రి ఊరు సరిహద్దులు దాటేవరకూ నా దురదృష్టదేవత నన్ను వెన్నుక్కుంటూ వచ్చి ఆపేస్తుందేమోనని ఎంత భయపడ్డాననీ!

కండలు పెంచిన రత్తి మొగుడు నా భయానికి నవ్వేడు. నేను కారును చాలా స్పీడుగా పోనిస్తుంటే మత్తులో కదలాడే ఆయన్ను చూసి నేను కరిగిపోతే—నన్నూరడించి ఆయన్ను ఫ్రంటుసీటులోకి ఎత్తుకుని తెచ్చి, నా ఒడిలో తలపెట్టి పరుండబెట్టి వెనక సీటులో కూర్చున్నాడు వాడు. తెల్లవారకట్ల ఇక్కడికి వచ్చేక కాస్త నిద్దరపోయేడు.

ఆ తర్వాత నేనూ నిద్రనుండి లేచి, అప్పుడే నిద్రలేచి బెరుకుగా పరిసర ప్రాంతాలను పరికిస్తున్న ఆయన్ను చూసి, ఆయన సంరక్షణలో దిగిపోయేను. నిన్నటి నిద్రమందు ప్రభావమో, లేక వాతావరణం మార్పో, అదీ కాకపోతే నా అదృష్టరేఖల కాంతో కానీ—ఆయన ఇవేళ చాలా బుద్ధిగా అన్నీ చెప్పినట్లే చేసేరు.

రత్తి మొగుడు నాలుగు రోజులు ఉంటానన్నాడు. కానీ నేనే పంపేసేను. నాకు నేను అన్నీ స్వయంగా నిర్వర్తించుకోవాలి ముందు ముందు. ఎన్నాళ్ళని మీమీద ఆధారపడగలను?

మళ్ళీ త్వరలో వ్రాస్తాను. ఉంటాను

సుమిత్ర.

డాక్టర్‌గారూ!

మీకు అప్పుడే నేను ఉత్తరం వ్రాసి వారం రోజులయింది. ఇది నా రెండవ ఉత్తరం. మీ రీపాటికి బహుశా చాలా ఖంగారు పడుతుంటారు.

మీకు ఏమాత్రం నచ్చని పనిని, మీ అంతరాత్మ సుతరామూ ఒప్పుకోని పనిని మీచేత చేయించిన మహాపాపిని నేను. క్షమించండి, డాక్టర్!

మొట్టమొదటి రోజంతా అదో విధమైన మునుభావంతో గడిపిన ఆయన, ఆ తర్వాత కొద్దిగా మాట్లాడడం మొదలుపెట్టినా, అదోలవూషి అనుభూతి!

నే నిక్కడకు వచ్చిన మూడవ రోజున కాబోలు! ఆయనను కారులో ఎక్కించుకుని మెల్లిగా సముద్రపు ఒడ్డువైపు షికారుగా తీసుకెళ్ళి, ఆయన దిగుతానని పేచీ పెట్టేసరికి హడలిపోయి రివ్వుమంటూ వెనుతిరిగి హోటలుకు వచ్చేసేను.

మధ్య దారిలో ఆయన నా జుట్టు పీకినంత పీకి, గిల్లినంత గిల్లి కోపంవచ్చి నిద్దరపోయేరు. ఈమధ్య ఈయన కోపం తమాషాగా ఉంటున్నది. మొదట్లో చితకబాదుతారు. నేను లెక్కచేయకుంటే బుంగమూతిపెట్టి పడుకుంటారు. బాధ ఆపుకోలేక ఏడిస్తే మరింత కొట్టి, ఫకాలుమని నవ్వేస్తారు. ఇంకోసారి దూరంగా జరిగి గంభీరంగా చూస్తూ ఊరుకుంటారు.

ఒక్కోసారి చంటిపిల్లవాడిలా ఏడుస్తారు.

దేన్నైనా సహించగలను కానీ—ఆ ఏడుపును భరించలేను. డాక్టర్! ఆయన బుంగమూతి పెట్టుకుని దూరంగా కూర్చుంటే ఎంత తమాషాగా ఉంటుందనీ!

రెండు రోజులక్రితం—అదే పౌర్ణమినాడు పొద్దున నేను స్నానంచేసి బాత్‌రూంనుండి వచ్చేసరికి—ఆయనకుగా ఆయన ఒళ్ళంతా గిల్లి పోగులు పెట్టుకుని ఎర్రగా కారుతూన్న రక్తాన్ని వింతగా చూసుకుంటూ కూర్చున్నారు.

ఆ దృశ్యాన్ని చూసి విలవిలలాడిపోయి నేను అడ్డుపోబోతే నన్ను కోపంగా కొట్టేరు. ఆయనను మెల్లిగా అదిలించి దెబ్బ లన్నిటినీ ఓర్చుకుంటుంటే—అలిసిపోయి నిద్రపోయేరాయన.

మెల్లిగా వాటన్నిటినీ డెట్టాలు నీళ్ళతో తుడిచి, పౌడరు అద్ది బట్టలు మార్చేనో లేదో—మేల్కొన్నారు. బుజ్జగించి అన్నం తినిపించి, పాట పాడి నిదుర పోగొట్టేసరికి సాయంత్రం అయింది. పడుకున్న వెంటనే నేను కారియర్ లోని నాలుగు మెతుకులు కతికేనో లేదో, లేచి కూర్చున్నారు.

చంద్రోదయం దగ్గరపడుతున్న కొలదీ ఆయన పిచ్చి ఎక్కువైపోతున్నది. ఎంత భయపడ్డాననీ, డాక్టర్! యాపిల్‌పళ్ళు ఇస్తే నా మొహాన్నే విసిరికొట్టేరు. ఇక ఆయనచేత తినిపించలేక — ఆయన పిచ్చి విషయం బయటకు తెలిసిపోతుందేమోనని — పాపిష్ఠిదాన్ని —నిద్రమందిచ్చి పడుకోబెట్టేసేను.

ఎల్లాగైనా రోజుకో ప్రదేశం కాబట్టి కొత్తగా పరికిస్తూ కూర్చుంటారు సాధారణంగా. కాబట్టి నాకు ఆశగా ఉంటున్నది.

ఇప్పుడు రాత్రి పన్నెండు దాటింది. సన్నగా గుర్రుపెట్టి నిదురపోతున్నారు. మళ్ళీ తెల్లవారితే నాకు తీరిక చిక్కదు. అందుకని ఈ టైములో వ్రాస్తున్నాను.

అదిగో, మాటలోనే కదిలి మంచినీళ్ళంటూ అరుస్తున్నారు. మళ్ళీ త్వరలో— ఉంటాను

సుమిత్ర.

డాక్టరుగారికి —

మొదటి ఉత్తరం మర్నాడే వ్రాసి, రెండవ ఉత్తరానికి వారం రోజులు తీసుకుని, మూడవ ఉత్తరం వ్రాయడానికి పది రోజులు పట్టిందంటారు మీరు. అవును. క్షమించండి.

ఆయన సంరక్షణలో రోజులు, భయం భయంగా గడుస్తున్నా త్వరత్వరగా దాటిపోతు

న్నాయి. మీరు నా కిచ్చిన గడువు పూర్తి అవుతున్నదని భయపడాలో, ఈయన తేరుకునే సమయం సమీపించవచ్చుననే ఆశల ఊయలలో ఊగులాడాలో తెలియని పరిస్థితి.

అమావాస్య దగ్గరకు వచ్చేస్తున్నది, డాక్టర్—నాకు భయం వేస్తున్నది. 'పిల్లి ఇలా అంటుం'దని కుక్క అరుపులూ, 'కుక్క ఇలా కూస్తు'ందని కాకి కూతలూ మొదలెట్టేరు పొద్దున్నే. హడలిపోయేను. ఆయనను బుజ్జగించి ఊరుకోబెట్టే సరికి నా మతిపోయింది.

'మతి' అంటే గుర్తు వచ్చింది. డాక్టర్! నిన్న మేము ఇక్కడికి కొత్తగా వచ్చేము. ఈ హోటల్ బాయ్ కారియర్ గదిలో పెట్టడానికి వచ్చి ఏదో మాట్లాడుతూ, "నాకు సినిమా అంటే మా చెడ్డ పిచ్చి" అన్నాడు. ఇందులో పిచ్చి అనే మాట వింటూనే వాణ్ణి తన్ని తరిమి తగలేసేరు. నన్ను కూడా తిట్టి, కొంతసేపు బుంగమూతితో కూర్చుని, పది నిమిషాలలో మళ్ళీ వచ్చి, "సినిమా అంటే ఎవరూ?" అని అడిగేరు.

ఏం చెప్పను, డాక్టర్?

చూసిస్తే కొద్ది కొద్దిగా తెలియవచ్చునని సినిమాకు తీసుకువెళ్ళేను. నా దురదృష్టంకొద్దీ దానిలో పిచ్చివాడు ఉన్నాడు. అది చూస్తూనే నన్ను చితకగొట్టడం మొదలుపెట్టేరు హాలులో. మెల్లిగా వదిలించుకుని, మావెంట మనుష్యులు మూగుతుంటే తప్పించుకుని నానా అవస్థపడి హోటలుకు తీసుకుని వచ్చేసేను.

ఒకానొకప్పుడు మా హనీమూన్‌లో చూసిన ప్రదేశాల్లోనుంచి తిప్పుతుంటే వింతగా అడుగుతున్నారు—'ఇదేమిటి? అదేమిటి?' అంటూ. ఏం చెప్పాలో తెలియని పరిస్థితి నాది.

నాలుగు రోజుల్రకితం—"నువ్వెవరో నాకు తెలియదు. కాబట్టి మాట్లాడకూడదు" అంటూ భీష్మించుకుని కూర్చున్నారు. నాకు బాధ ఆగక కన్నీరు తిరిగేసరికి అలక తగ్గించి, "పోనీలే, మాట్లాడుదాము" అని ముందుకు జరిగేరు. అయా సమయాల్లో ఒక్కోసారి నాకే మతి పోతుందేమోనని భయం వేస్తున్నది నాకు.

అంచలమీద పరుగులెట్టుకుంటూ వస్తున్నది అమావాస్య. అందమైన చందమామ తరిగిపోతున్నాడు. అలాగే నా జీవితంలో మంచి రోజులు అన్నీ దాటిపోయి చివర కిలా అమావాస్యే మిగులుతుందా అన్నంత భయం వేస్తున్నది.

అర్ధరాత్రి అమాంతంగా నిద్రలేచి, పక్కనే కునికిపాట్లు పడే నన్ను లేపి రెండు వేళ్ళు చూపించి ఇవెన్ని? అని అడుగుతారు. వాటిని రెండు అనకూడదు. అది రెండు కానప్పుడు ఆయన దృష్టితో ఎన్నో నాకేం తెలుస్తుంది? అందుకని అప్పుడప్పుడు "రెండు" అంటూ నిజం చెప్పి భంగపడి, ఇంకోసారి—"ఏమో" అంటూ తప్పుకుంటాను.

అవి నిజంగా రెండే.
జీవితంలో
మంచీ చెడులలాగా,
సుఖ, దుఃఖాలలాగా;
ఆకాశంలో
సూర్యుడూ, చంద్రుడూలాగా;
లోకంలో బండి చక్రాలలా, సత్యా సత్యాలలాగా
అవి రెండే.

అయితే ఏం? నిజం చెప్పకూడదు. అబద్ధంలో బతకాలి. ఇంకేం వ్రాసినా ఇదే ధోరణిలో సాగుతుంది ఉత్తరమంతా! కాబట్టి ఇంతటితో ఉంటాను.

సుమిత్ర.

ప్రాణదాతలు డాక్టరుగారికి—

అమావాస్య గురించి భయపడుతూ వ్రాసి నేను, ఆ అమావాస్యతోపాటు ఈ పౌర్ణమికూడా దాటిపోయేక వ్రాస్తుంటే మీకు కోపం వస్తుంది! అవును. అందులో ఆశ్చర్యమేముంది? మీకు నేను మాట ఇచ్చిన ప్రకారం వారం వారం ఉత్తరాలు వ్రాయలేకపోయేను.

తమాషా ఏమంటే నేనంతగా భయపడిన అమావాస్యనాడు ఆయన విపరీతంగా నవ్వడం మినహా మరేం చెయ్యనేలేదు. పైపెచ్చు నేను నిద్రపోతూంటే లేపి కూర్చోబెట్టి, ఎక్కాలు చెప్పమని బలవంతం చేసేరు. నేను విభ్రాంత పోయి నిలబడితే "పోనీ లెక్కలు చెప్పు" అని అడిగేరు. ఖంగారు పడి, ఆయనకు నిద్ర మందు ఇవ్వనందుకు నన్ను నేను తిట్టుకుంటూ నిలబడ్డాను.

నవ్వేరు విరగబడి. "నీకూ రావేమిటే?" అన్నారు.

"ఉహూ" అన్నాను ఏం చెప్పాలో తోచక.

"పోనీలే, కథలు చెప్పు" అంటూ నావైపు చూసేరు. సరేనంటూ కథ మొదలుపెట్టేను.

ఆ కథ ఏమిటో అనుకుంటున్నారా? ఆ సమయంలో చిన్న పిల్లవాడిలా కనిపించే ఆయనను చూసి రాజకుమారీ, రాక్షసుడూ కథ చెప్పాను. రాజకుమారి బాధలు వింటూనే, ఎంతో జాలిగా "చివరకు రాజకుమారి ఎక్కడుందీ?" అన్నారు ఏడుస్తూ.

"ఇప్పుడు వాళ్ళమ్మావాళ్ళ దగ్గర కులాసాగా ఉంది." వెంటనే ముగించేసేను.

వెంటవెంటనే విరగబడి నవ్వేసేరు, ఆ కన్నీళ్ళు తుడుచుకోకుండానే. ఈ హఠాత్పరిణామాలకు విస్తుపోయి నేను నిలబడితే—"నే నెళ్ళి ఆ రాక్షసుడితో ఇలా యుద్ధం చేస్తా" నంటూ నామీదికి ఉరికేరు.

ఖంగారులో పారిపోబోయి, అసలు ప్రపంచంలోకి దిగి వచ్చేస్తూ, "నేను రాజకుమారిని. రాక్షసుడు పారిపోయేడు" అన్నాను.

"మీ అమ్మావాళ్ళూ ఏరీ?" అడిగేరు వింతగా.

"నన్ను మీతో వెళ్ళమని చెప్పేరు!" పరికిస్తూ అన్నాను. ఆశ్చర్యంగా చూస్తుంటే అవునంటూ తల ఊపేను.

"అయితే నేను నిన్ను రక్షించాలి. ఇలారా" అంటూ మంచంమీద పడుకోబెట్టి పెద్ద దుప్పటి కప్పేసి, "ఉష్ మాట్లాడకు. రాక్షసుడు వింటాడు" అన్నారు ప్రశ్నించబోయిన నన్ను ఆపేస్తూ.

ఆతర్వాత త్వరత్వరగా కిటికీ తలుపులూ అవీ మూసేసి చప్పుడు కాకుండా ముంగాళ్ళమీద నడుస్తూ వచ్చి మెల్లిగా ముసుగుతీసి, "నీకు భయమేస్తోందా?" అని అడిగేరు జాలిగా.

ఆయన అల్లా ప్రేమగా మాట్లాడుతుంటే బాధ ఆపుకోలేక ఏడ్చేసేను, డాక్టర్!

"నిన్ను రాక్షసుడు ఎత్తుకుపోకుండా నేను కాపలా ఉంటాలే. పడుకో" అంటూ జోకొట్టేసేరు. మైమరపులో నిద్రపోయేను.

తిరిగి నాకు మెలకువ వచ్చేసరికి ఆయన కటిక నేలమీద నిద్రపోతూ కనిపించేరు.

పాపాత్మురాలినని నన్ను నేను నిందించుకుని, ఆయనను జాగ్రత్తగా లేపి మంచంమీద పడుకోపెడుతూండగానే కత్తిరించుకున్న నా జడ కొసలు



సింగారింపు

చిత్రం—పిరిశెట్టి అచ్యుతరావు (పుల్లేటికుర్రు)

పట్టుకులాగి, "ఇది నీకు సెలులా? ఈ కత్తిరింపు లేమిటే?" అంటూ గుంజి పడేసేరు. అతి కష్టం మీద విడిపించుకుని మెల్లిగా, జాలిగా, దీనంగా "ఆ రాక్షసుడు మళ్ళీవచ్చి నన్నెత్తుకు పోతాడేమో—అల్లరి చెయ్యకుండా పడుకోరూ!" అని బతిమిలాడితే, "సరే" అంటూ బుంగమూతితో నిద్దరపోయేరు.

అమావాస్య అలా గడిచింది.

శుక్లపక్షమి రోజులు వస్తుంటే నెల రాజుతో పాటు నా రాజు పరిస్థితి కూడా అభివృద్ధి అవుతుంది అనుకుంటున్నాను. ఎందుకంటే—ఎక్కువగా అనవసరం మాటలు మానేసేరు. ప్రతిదీ ఉత్సాహంగా పరికించడం, దానిని గురించి నన్ను ఆత్రుతగా ప్రశ్నించడం చూస్తుంటే ఆశ పుట్టేది.

పౌర్ణమి రానే వచ్చింది. ఒకానొకప్పుడు ఈ

వెన్నెల్లో దాగుడు మూతలాడిన మేము కొత్తలో హనీ మూన్‌కని ప్రణయ యాత్రల్లో ప్రయాణాలు చేసిన పరిసరాలను వారు ఎన్నడూ చూడనంత వింతగా పరిశీలిస్తుంటే నాకు బాధ ఆగలేదు, డాక్టర్!

మొన్న పౌర్ణమినాడు వెన్నెల్లో ఆయన ఒడిలో తలపెట్టి నేను నిద్రపోతూంటే ఎక్కడినుంచి సంపాదించేరో బ్లేడు ముక్క తెచ్చి, నా బుగ్గమీద గీసేరు.

వింత తందనాలూ నక్షత్రాలని ఉరుకుతుంటే, నా దండమూను వెన్నెల్లో మెరిసే ఆ రక్తానికి పకపకా నవ్వేస్తుంటే మెలుకువ వచ్చింది నాకు. బుగ్గమీద ఏదో నిప్పు పెట్టినట్టు బాధ. తడుముకోబోతే చేతులూ గీకేసేరు. ఏడిస్తే, గీయబోతూ ఆగి, "ఏం బాగాలేదూ?" అని అడిగేరు సైగా.

"బాధగా ఉంది" అన్నాను. అంతకంటే వేరేమంటాను?

"బాధగా అంటే?" ఆశ్చర్యంగా అడిగేరు.

"గుండెల్లోనొప్పి" అన్నాను ఇంకే మనలేక.

"పోనీలే, ఇక గిచ్చను" అని, బ్లేడును గిరాటు వెయ్యబోయి, "నన్నూ గిచ్చుకుంటాను" అంటూనే కసిక్కిన మోచేతినుంచి ముంచేతిదాకా గీసేసుకున్నారు.

కెవ్వుమని అరిచి పడిపోయేను. తిరిగి నాకు స్పృహ వచ్చేసరికి రక్తసిక్తాలైన నా బుగ్గలు తుడుస్తూ కనిపించేరు. ఆయన మోచేయి రక్తం కారి కారి గడ్డ కట్టిపోయింది.

ఏం వ్రాయను, డాక్టర్?

ఆవేళటికి ఆయనను దగ్గరుండి పడుకోబెట్టి, ఆయన మోచేతిని డెట్టాలు నీళ్ళతో కడిగి, ఆయింట్‌మెంట్ పూసేను.

ఇలా పౌర్ణమి గడిచింది. మళ్ళీ అమావాస్య వస్తున్నది. ఇలా ఎన్ని అమావాస్యలను నేను చూడాలో? సుమిత్ర.

డాక్టరుగారూ!

చాలా అన్యాయంగా ఉంది మీ ఆరోపణ. రెండు నెలలనుంచీ నా దగ్గరనుండి ఉత్తరాలు లేవంటూ పత్రికాముఖంగా మీ పేరుతో పడిన 'పెర్సనల్ కాలమ్'లోని ప్రకటన చదివేను. నేను మీకు వ్రాశానండీ!

సరే. ఇంతకూ మీరు నా సంతోషంలో ఇంతవరకూ పాలుపంచుకోలే దన్నమాట.

అయితే మళ్ళీ మళ్ళీ వినండి. ఆయనలో మార్పు వచ్చేస్తున్నది, డాక్టర్! మునుపులా కాదు. నా జీవనజ్యోతి ప్రకాశించడం మొదలుపెట్టింది. కొడిగట్టబోతూన్న దీపాన్ని ఆరిపోకుండా హాయిగా వెలిగేలా చేసుకున్నాను.

ఇంతకూ మీ ప్రకటన ఎలా చదివేననుకుంటున్నారు? మునుపు పేపర్లు చదివేదాన్ననే, మీ ఉద్దేశ్యం?

ఇప్పుడు ఆయన పేపరు చదివి, అందులో విషయాల గూర్చి నాతో మాట్లాడతారు. అసలు పేపరుమీద శ్రద్ధకు కారణం—ఓ తమాషా జరిగింది లెండి!

అప్పట్లో ఓనాడు ఆయనను కారులో కూర్చోబెట్టి షికారుకు బయలుదేరేను.

బీచ్‌లో ఆపి, కారులోనే కూర్చుని ఉన్నాము. ఈలోగా పేపర్ కుర్రవాడు వచ్చి "పేపర్ కావాలా" అని అడిగేసరికి—వద్దనే నన్ను ఆపి, కావాలని చేతులు చాచేరు. సరేనని కొన్నాను, బాధగా—కాస్త మనుష్యులను పరికిస్తే మార్పు రావచ్చు ననుకుంటుంటే ఈయన ఈ కాగితాలను గట్టిగా చదవడం మొదలుపెడతారేమోనని భయపడి!

ఒకచోట నా ఫోటో పడింది. అది చూసి, "నువ్వు" అంటూ చప్పట్లు చరచడం మొదలుపెట్టేరు. ఆశ్చర్యంగా పరికిద్దును గదా—నాదే! తీరా చూస్తే—అంతనంత సొమ్ముతో నేను పలాయనం చిత్తగించేనుట—పట్టిచ్చినవాళ్ళకు బహుమతి—అంటూ మా అత్తగారు వేయించిన ప్రకటన అది!

నిర్ఘాంతపోయేను.

ఆ తర్వాత ప్రతి రోజూ పేపరు కావాలని పేచీ పెట్టడం, నా బొమ్మకోసం వెతకడం, కనిపించక చించిపోగులు పెట్టడం ఆయన దినచర్యల్లో ఒక భాగమైంది.

ఒకసారి నేను—"అందులో మంచి వార్తలుంటాయి, తెలుసునా?" అంటూ మెల్లి మెల్లిగా చదివి చెప్పడం మొదలుపెట్టి అలవాటు చేసేను.

కొద్ది కొద్దిగా మనుష్యుల్లో పడ్డారు. పూర్వస్మృతికోసం భగవంతుని వేవిధాల ప్రార్థిస్తున్నాను.

సుమిత్ర.

పి. ఎస్. ఇది మీకు అందాలని రిజిస్టర్డ్ పోస్టులో పంపుతున్నాను.

డాక్టర్!

ఎలా మొదలుపెట్టాలో, ఏం వ్రాయాలో తెలియడంలేదు. నాకు పిచ్చి ఎక్కనందుకు నన్ను నేను అభినందించుకుంటున్నాను.

నా జీవన తార మెరుస్తున్నది, డాక్టర్! నా ఆశాజ్యోతి వెలుగుతున్నది, డాక్టర్! నా ప్రాణం పంచమ స్వరాన్ని ఆలపిస్తున్నది, డాక్టర్! నా భాగ్యరేఖ వెలికివచ్చి నవ్వుతున్నది నా జీవితపు వెలుతురులలో.

అర్థమైందా, డాక్టర్? ఆయన, మొన్న వాళ్ళ పూర్వకాలపు స్నేహితుడిని చూసి గుర్తుపట్టేరు. అతని ప్రశ్నలకు జవాబు లిచ్చేరు సవ్యంగా. వెళ్ళిపోతూ, అతను—"అర్జంటు పనిమీద పోతున్నాను. ఎక్కడుంటున్నావు? రేపు వస్తాను" అంటూ, నేను అడ్రసు చెప్పగా వ్రాసుకుని, "నీ వైఫా? కంగ్రాట్స్" అంటూ షేక్‌హాం డిచ్చి వెళ్ళిపోయేడు.

ఆయన ఆశ్చర్యంగా నన్ను పరికిస్తుంటే—అంచీలమీద హోటలుకు తీసుకువెళ్ళి, నన్ను నేను ఆయన కెరిగించుకున్నాను. నా ఈ బాబ్‌డ్ హెయిర్‌కు ఆశ్చర్యపోయి, "సుమీ" అంటూ పలక





వేసవిలో దాహానికి ఆరోగ్యకరమైన
చల్లని పానీయం:
AN ACE PRODUCT
డ్రింకాల్‌నే
వాడండి!



పలురకముల
పళ్ళరసములతో
తయారుచేయ
బడినది
★
వివిధ రకముల పళ్ళ
రసములతో తయారైన
అన్నిరకముల పానీయములు
కూడా లభించును.
తయారుచేయువారు
ఎంబ్రోసియా
క్యానింగ్ ఎంటర్‌ప్రైసెస్.
పోస్టుబాక్సు నెం. 543 :: విజయవాడ-3
సోల్ డిస్ట్రిబ్యూటర్లు:
ఏ. ఎల్. ఆల్ ఇండియా ట్రేడింగ్
కంపెనీ,
(జె.బి. మంగారాం & కంపెనీకి డిస్ట్రిబ్యూటర్లు)
శివాలయం వీధి, విజయవాడ—1.
SUVARNA

రించేరు. పలకరించేరు, డాక్టర్, నన్ను! ఆయన పెట్టుకున్న ముద్దుపేరుతో పలకరించేరు. నా సంతోషానికి అవధులు లేవు.

నా కీ అవకాశం, ఆనందం కలిగించిన మీకు మేము ఇరువురమూ త్వరలో వచ్చి ఆ బాకీ తీర్చు కుంటాము. సుమిత్ర.

డాక్టర్‌గారూ!

అదృష్టవంతుణ్ణి చెరిపేవాడూ, దురదృష్ట వంతుణ్ణి బాగుపరిచేవాడూ లేడట! అది నావల్ల రుజువయింది, డాక్టర్!

ఆయనకు మతి తెప్పించిన ఆ స్నేహితుడు, వాళ్ళమ్మగారికి ఈ విషయాలన్నీ చెప్పేడుట! ఆ మర్నాడు ఆయన మమ్మల్ని కలుసుకుని మా ప్రోగ్రాం అంతా తెలుసుకోవడంవలన ఆ విష యమూ చెప్పేడు ఆవిడకు. అంతే. నన్ను వెతు క్కుంటూ నా దురదృష్టపు నీడవచ్చి నన్ను అతుక్కుపోయింది. నిర్భాగ్య దేవత నా మెడలో పూలహారం వేసింది. విధి వికృతంగా నవ్వింది.

ఆయనకు మతి పోగొట్టింది నేనేనని, ఆయ నకు మతి చలించిన తర్వాతనే నేను ఈ విధంగా జుట్టు కత్తిరించుకుని తయారయ్యానని, నాకూ మీకూ ఏదో సంబంధం ఉన్నట్లు ఆ ఊళ్ళో అందరికీ తెలిసిపోవడంవలననే నేనిల్లా ఊళ్ళవెంట తిరుగుతూ మీకు ప్రేమలేఖలు వ్రాస్తున్నాననీ, గోసాయి చిట్కాలు ఉపయోగించి ఎప్పటికప్పుడు ఆయనకు మతిరాకుండా చూసు కుంటున్నాననీ—నమ్మేలా చెప్పింది, డాక్టర్, ఆవిడ!

మగవాడు దేన్ని అంత త్వరగా నమ్మడట— అది తన ఆడదాని విషయమైతేతప్ప!

ఆవిడ వచ్చి ఈయనను ఆస్పత్రిలో చేర్పిం చిందట. అప్పటివరకూ నేను చీకటి కొట్లోవేసి ఆయనను బంధించి ఉంచేనట. డాక్టర్ల వైద్యం చేస్తే త్వరలో ఆయన మామూలు మనిషి కాగల డని—మీతో అక్రమసంబంధం ఏర్పరుచుకుని ఇలా వచ్చేనట.

ఎన్ని మాటలన్నా ఆడది సహించగలదు గానీ, శీలాన్ని శంకిస్తే సహించలేదని మీ కెల్లా తెలియ చెప్పను? సరిగ్గా ఆయన ఈ ప్రపంచంలోకి అడు గిడేముందు ఒక అగాధం తవ్వింది ఆవిడ, మా ఇద్దరిమధ్యా. ఆయనకు మతిపోతుందని భయ పడి, ఆయన మనస్సు నొచ్చుకుంటుందని భయ పడి నిశ్శబ్దంగా ఏడ్వడం మినహా మరోటి చెయ్య లేకపోయాను ఆనాడు.

నా బుగ్గలమీద ఆయన బ్లేడుతో గీసింది చూపెట్టి—అవి ఎవరివో దంతక్షతాలని ఆయ నకు నూరిపోసింది. నా బాధ ఏమని వ్రాయను?

ఆఖరిసారిగా ఒక్కటే మాత్రం చెబుతున్నాను, డాక్టర్! ఆయన నన్ను పూర్తిగా అపహ్యాంచు కుంటున్నారు.

దేనికోసం నా జీవితాన్ని సైతం రైలుపట్టాల మీద పరిచేనో—అది నాకు అలభ్యం అని తేలి పోయింది—పైపెచ్చు నేను దానికి అనర్హురాలి నని విధి వెక్కిరించింది. ఇక నా జీవితం అమా వాస్యల్లో, బ్రహ్మజెముడు డొంకల్లో, నాగు బాముల పుట్టల్లో మునిగిపోతుంది. వెనక నేను వ్రాసిన రెండు ఉత్తరాలు మీకు అందలేదన్నారు చూడండి? అవి ఈవిడ చదివిందట. అవి ఆయన తో చెబుతుంటే విన్నాను.

ఆవిడ నిజంగా చదివితుంటే ఇంత అవ మానానికి ఆస్కారం యేది? ఆయుష్యాంతం నన్ను ఆవైపుకి తొక్కుపోతున్నది విధి.

మరి ఇక సెలవు. మళ్ళీ ఈ జన్మలో ఇక కలియం.

అన్నయ్యగా, గురుతుల్యులుగా, నా జీవిత భాగ స్వామిని ప్రసాదించిన దైవ స్వరూపులుగా నమస్కరిస్తూ ఇక సెలవు శాశ్వతంగా తీసు కుంటున్నాను.

సుమిత్ర.

* * * *

డాక్టర్ అందించిన ఉత్తరాలు చదవడం పూర్తిచేసి తలఎత్తాడు శ్రీనివాసు.

కన్నీరు చెంపలమీద చారికలు కట్టివుంది.

"నన్ను క్షమించాలి, మిస్టర్ శ్రీనివాస్! మీ అమ్మగారు ఆ విధమైన దుష్ప్రచారం చెయ్య డానికి కారణం తెలుసునా? మీరు పిచ్చిలో మీ మీ భార్యను కటకటాల మధ్యనుంచి చితకబాది నప్పుడు, మీ చెల్లెలిని పిలిచి కొడుతుంటే మీ అమ్మగారు మిమ్మల్ని తిట్టే తిట్లు వినలేక తనకు తాను అందించుకుని సుమిత్ర దెబ్బలకు ఓర్చు కుంటుంటేబయట నించుని పిచ్చి అరుపులు పెట్టి మీలోని ఉద్రేకాన్ని రెచ్చగొట్టేవారు. అది చూసి సహించలేక నేను వాళ్ళని అదిలించేను. అదీ కారణం!! మీ కిప్పుడు మీ సుమిత్ర గూర్చి తెలి సిందిగా? అదంతా ఆవిడ చేతి వ్రాతే. ఎటొచ్చీ ఆవిడనోసటి వ్రాతే బాగాలేదు. ఇంతకీ మీకు మతి పోవడానికి కారణం మీ ఆఫీసులోని ఎయిర్ కూలర్."

డాక్టరు మాటలను పూర్తిగా వినకుండానే వడి వడిగా ఇంటికి పోయేడు శ్రీనివాసు.

కిటికీ దగ్గర నించొని వరండాలోకి తదేకంగా చూస్తున్న సుమిత్రను చూడగానే—శ్రీనివాసు అటు దిక్కుగా పోయి ఆమె దేన్ని పరికిస్తున్నదో నని చూసేసరికి వరండా గోడమీద ఉన్న తన ఫోటో మీద ఆమె కళ్ళు నిలిచిఉన్నాయి.


కిటికీ ఊచలు పట్టుకుని నిర్జీవంగా నిలబడిన సుమిత్ర నీళ్ళు నిండిన కళ్ళు దృశ్యాలను స్పష్టీక రించడం లేదని కళ్ళు వాల్చింది ఒకసారి. వాడి పోయిన ఆమె చెంపలమీదనుంచి కిందికి జారి పోయింది ఆ నీరు.

గది తలుపులు తెరుస్తూ, "సుమీ" అని పిలిచేడు ఆత్రుతగా.

పొద్దున నిండు సూటులో, టై కట్టుకుని హుందాగా చలవ కళ్ళద్దాలు ఊపుకుంటూ కారు దగ్గరకు నడిచిపోతున్న ఆయన ఆకారాన్ని కళ్ళారా చూసుకున్నందుకు చీదరించుకుని ఉమ్మేసిన శ్రీని వాసు—"సుమీ" అని పిలిచేసరికి ఇటు తిరిగి, తిరుగుతూనే దోసిట్లో మొహందాచుకునివెక్కివెక్కి ఏడుస్తూ—"నన్నింక కొట్టకండి. నా మనస్సూ, శరీరమూ కూడా చితికిపోయేయి. మీ చేత్తో ఇంత విషం ఇయ్యండి. అమృతంలా తాగుతాను" అని అడిగింది.

"కాదు, సుమిత్రా! నాదే తప్పు." దగ్గరకు వచ్చి ముఖంమీద అరిచేతులు తొలగించిన శ్రీని వాసును అర్థం కానట్లు చూసింది ముందు సుమిత్ర. తర్వాత ఆశ్చర్యపోయింది, కనులు విప్పారి నవి. ఆ పిమ్మట మహాసంతోష పడి పోయింది. ముఖమంతా వెలిగిపోయింది ఆ సంతో షంతో.

ఆఖరిసారిగా—ఫకాలుమని విసగబడి నవ్వి,



మధుర మండపంలోని శిల్పం
ఫోటో — ఎస్. ఆర్. డి. మూర్తి (మద్రాసు-4)

"డాక్టర్! నువ్వేనా ఆయనకిచెబుతావనుకున్నాను" అంటూనే ఏడుస్తూ, "నువ్వూ చెప్పలేదు. అవును. ఎందుకు చెబుతావు?" అని, మళ్ళీ కళ్ళను విశాలంచేసి, "కానీ—ఆయనకి మాత్రం నేనంటే చాలా ప్రేమ. పొద్దున ఆయన్ని చూసి చిరునవ్వు నవ్వితే—ఆయన సూటులో కారు దగ్గరకు పోతూ వెనక్కి వచ్చి, నన్ను....నన్ను...." అంటూ ఖంగారుగా దిక్కులు పరికించి—"చూసి ఉమ్మేశారు" అంటూ విరుచుకుపడిపోయింది, పరిస్థితి అర్థంకాక చూస్తూ నించున్న శ్రీని వాసు కళ్ళ ఎదురుగుండానే. ★